# ఓ పర్సు కథ

ఆదూరి వెంకట సీతారామమూర్తి

టీవీల్లో సినిమాలు వచ్చేవేళ.

పగలంతా కాసిన ఎండకి ఉక్కిరిబిక్కిరైన ఆకాశం విశ్రాంతికి ఉపక్రమించే వేళ. ఆదివారం సాయంకాలం ఆరున్నర గంటలవేళ.

కలుషితమైపోతున్న వాతావరణం గురించి ఆలోచిస్తూ డాబామీద కూర్చుని చల్లగాలి పీలుస్తున్న వేళ. గేటు చప్పుడైతే పిట్టగోడలమీంచి కిందకి చూసాను. పక్కింట్లో అద్దెకుంటున్న జగన్నాధరావుగారూ, వాళ్ళబ్బాయి కామేశ్వర్రావు గేటు తీసుకుని లోపలికొస్తున్నారు.

జగన్నాధరావుగారు తాలూకాఫీసులో గుమస్తాగిరీ చేసి రిటైరయ్యారు. పదికీ పాతిక్కీ కాకపోయినా వందకీ రెండొందలకీ కూడా కక్కుర్తిపడే రకంకాదు. రిటైరయ్యాక ఉంటానికో గూడు నిలబెట్టుకోలేకపోయినా నిజాయితీపరుడన్న పేరు మాత్రం నిలబెట్టుకున్నాడు. ఇంట్లో పెళ్లీడుకొచ్చిన ఓ ఆడపిల్ల, ఇంకా చదువులు వెలగబెట్టే మగపిల్లలూ ఉన్నారు. ఈ కామేశ్వర్రావు పెద్దవాడూ, డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నవాడూ.

''మీతో చిన్నపని పడింది'' అన్నారాయన ఆఖరి మెట్లెక్కి ఆగి. మనిషి ఆయాసపడుతున్నాడు.

''చెప్పండి'' అంటూ ఆయనకు కుర్చీ చూపించి నేను పిట్టగోడకు జారబడ్డాను.

ఆయన కూర్చోలేదు. కాస్సేపు మౌనం వహించేక–

''పనంటే పనికాదు. చిన్న సలహా'' అన్నాడు.

నేను కాలేజీ లెక్చరర్నని ఆయనకి నేనంటే గౌరవం.

''సరే కూర్చుని చెప్పండి'' అన్నాను.

''నిన్నవాళ ఈవెనింగ్ వాక్ నుంచి తిరిగొస్తుంటే మన బజారు జంక్షన్‌కి కాస్త అవతల ఓ పర్సు దొరికింది. ఎవరిదో ఏమిటో... అక్కడ ఎవరూ కన్పించలేదు'' అన్నారాయన కూర్చుని.

''ఏముందందులో?'' అడిగాను.

''పై అరల్లో ఒక చీటీ, కొద్దిగా చిల్లరా, ఒక తాళం చెవి ఉన్నాయి. లోపల ఒక సేఫ్‌లాంటి అరలో కొన్ని సరికొత్త నోట్లూ ఉన్నాయి'' అన్నారాయన పర్సును నాచేతికందిస్తూ.

''అంతేకదా. ఉండనివ్వండి. పర్సులో వేలూ, లక్షలు లేవుకదా! ఎవరైనా వచ్చి అడిగితే ఇచ్చేయవచ్చు'' అన్నాను దాన్ని అందుకుంటూ.

పాతకాలంనాటి పర్సే అయినా కాస్త పెద్ద సైజులో ఆ కాలానికది ఖరీదైందిలానే వుంది. సాఫ్ట్ లెదర్‌తో తయారైందేమో చేతిలోకి తీసుకుంటే పొందిగ్గా పావురాయి పిల్లలా వుంది. పైన 'ఆర్' అనే ఇంగ్లీషు అక్షరం బంగారు రంగులో మెరుస్తోంది. అందులో వున్న చీటీలో అర్థంకాని తెలుగు భాష, ఏవేవో అంకెలూ ఉన్నాయి. కిందన 8 వేల అంకె వేసి వుంది. దానికింద ఓ పొట్టి సంతకం వుంది. చీటీ వెనుక 'రాజ్' అని ఇంగ్లీషులో పేరుంది.

''అది బంగారపు షాపు వారిచ్చిన చీటీ అయివుంటుందని నా నమ్మకం. ఆ పర్సుగలాయన ఏదో వస్తువు చేయించడానికి ఇచ్చినట్టుంది. దాని ధరలో పాత బంగారం ధర తీసేయగా ఇంకా ఇవ్వాల్సింది ఎనిమిదివేలని అర్థమవుతోంది'' అన్నారాయన.

అంత వివరంగా చెప్పేసరికి నిజమేననిపించింది. ఎంత వేలమీద బిజినెస్ చేస్తున్నా బంగారపు షాపువాడు అటువంటి తలా తోకాలేని చీటీకే తప్ప సరైన బిల్లు ఇవ్వరు కదా.

''తాళం చెవి ఏ స్టీలు అల్మరాదో అయివుంటుంది'' అన్నాను.

''లాకర్‌దో, ఐరన్‌సేఫ్‌తో ఎందుక్కాకూడదు?'' ఎదురుప్రశ్న వేశారాయన.

''కావచ్చు కూడా. పైకి కనిపించని రహస్య అరలో రెండు రూపాయల నోట్లూ, ఐదు రూపాయల నోట్లూ రెండేసి, పది రూపాయలనోటూ, యాభైరూపాయల నోటూ ఒక్కొక్కటికాక ఒక వంద రూపాయలనోటూ, ఒక ఐదొందల రూపాయల నోటూ సరికొత్తవి ఉన్నాయి. రెళ్ళూ, ఐదులూ నోట్లు...అంత కొత్తవి. చూస్తే ముచ్చటేసింది. బహుశా అతనెవరో కొత్తనోట్ల సరదాకొద్దీ దాచుకుని వుండొచ్చనిపించింది.''

''కంగారుపడవలసినంత డబ్బుగానీ విలువైన వస్తువులుగానీ ఇందులోలేవు. తాళం చెవి డూప్లికేట్ చేయించుకోవచ్చును'' అన్నాను.

''అలా అనేయకండి. అదెవరిదో డబ్బున్న పెద్దయనదే అయివుంటుంది. ఏ పిల్ల పెళ్లికో బంగారునగ ఆర్డరిచ్చి వుంటాడు. బహుశా ఇందులో వుండిపోయిన ఆ చీటీ లేందే ఆ నగ అతనికి రాకపోవచ్చు. తాళం చెవి కూడా డబ్బో, విలువైన వస్తువులో వుంచిన లాకర్‌ది కావొచ్చు. పాపం ఏం ఇబ్బంది పడతాడో ఆయన'' అన్నారు జగన్నాధరావుగారు.

''ఇంతకీ ఏం చేద్దామంటారు?'' అడిగాను.

''అతనెవరో తెల్సుకోవాలి. ఆ పర్సును ఆయనకు ఇచ్చేసేవరకూ నా మనసుకు శాంతి ఉండదు'' అన్నారాయన.

''పోనీ ఏ న్యూస్ పేపర్లోనో ప్రకటన వేయిస్తేనో...'' అన్నాడు కామేశ్వరరావు కల్పించుకుని.

''చూడాల్సినవాళ్ళు దాన్ని చూడకపోతే మనకి తడిసి మోపెడౌతుంది ఖర్చు. లేనిపోని సమస్యలు చుట్టుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదు. అయినా ఈ పర్సును పర్సుగలాయన అజాగ్రత్తవల్లే పారేసుకున్నాడో లేక ఏ దొంగవెధవైనా అతగాడి జేబు కొట్టేసి పైకి కన్పించే నోట్లను లంకించుకుని ఏ బస్సులోంచో చటుక్కున బైటికి విసిరేసేడో...'' అన్నాను.

''అలా జరగడానికి కూడా ఆస్కారముంది. పైగా ఇది దొరికిన చోట చీకటి కూడాను'' అన్నారు జగన్నాధరావుగారు.

''అలాగే జరిగుంటే పుణ్యానికి పోయి మీరు చిక్కుల్లో పడే ప్రమాదం కన్పిస్తోంది'' అన్నాను.

''ఎలా?'' అన్నట్లుగా ఆయన నా కళ్లల్లోకి చూసారు.

''ఆయనమీద జాలిపడి పేపర్లో వేయించో, మరో లాగో పర్సుగలాయనను కనుక్కుని మీరు పర్సు ఇచ్చారనుకోండి. ఇందులో ఐదువందల రూపాయలు నోట్లు మరో ఆరుండాలి వీటి సంగతేమిటని నిలదీసాడనుకోండి. అప్పుడో?'' అన్నాను.

జగన్నాధరావుగారి ముఖం అదోలా మారిపోయింది.

''అందుకే అమ్మ చెప్పినట్టే చేద్దాం నాన్నా'' అన్నాడు కామేశ్వరరావు.

''ఆవిడేం అన్నారు?'' అడిగాను ఆత్రంగా.

''ఆ నోట్లను చిల్లరగా మార్చి ఓ డబ్బాలో పోసి అడుక్కుతినే వాళ్ళకి ఆ అనామకుడి పేరుమీద దానం చెయ్యమంది.''

''పాతకాలంనాటి వారి ఆలోచనలు అలాగే ఉంటాయి మరి'' అంటూ నవ్వాను.

''దానిక్కూడా నా మనసొప్పడంలేదు. ఒకరి సొమ్మును మనం ఎవరిమి దానం చేయడానికి?'' అన్నారు జగన్నాధరావుగారు.

''అటువంటప్పుడు మీరు దాన్ని చూసినా తియ్యకుండా ఉండాల్సింది. ఏ దారినపోయే దానయ్యకో దొరికితే హాయిగా డబ్బు ఖర్చు పెట్టుకునేవాడు. లేదా తిరిగివస్తే ప్రాప్తముంటే పోగొట్టుకున్నాయనకే దొరికేది. మీకు మనశ్శాంతిగా ఉండేది'' అన్నాను.

''అలాగే చేయాల్సింది. ఇప్పటికైనా మించిపోయిందిలేదు. మీరన్నట్లు ఎక్కడ దొరికిందో అక్కడే పడేస్తే మంచిదనిపిస్తోంది. ఏమో? జారవిడుచుకున్నాయన తిరిగి వెదుక్కుంటూ రావచ్చుకదా'' అన్నారాయన.

''ఆ పని చెయ్యండి'' అంటూ పర్సు అందించాను.

పరిష్కారం దొరికినట్లు మెట్లు దిగారాయన. వాళ్ళిద్దరూ వెళ్లాక డాబా దిగి గుమ్మంలోకి అడుగుపెట్టాను.

''మూడు లంగాలు కొనండి. రెండు డ్రాయర్లు ఉచితంగా పట్టుకుపొండి'' అంటోంది లోకల్ టీవీ ఛానల్లోని అమ్మాయి. బట్టల షాపు ప్రకటన కాబోలు సినిమా డైలాగ్‌కి తీసిపోకుండా ఉంది.

టీవీ స్విచ్ ఆఫ్ చేసేసరికి హాల్లోంచి పిల్లలు తుర్రుమన్నారు. కుర్చీలో జారబడి ఐదు నిముషాలు కూడా కాలేదు. గేటు తీసుకుని మళ్ళీ ఆయనే గోడక్కొట్టిన బంతిలా.

''అక్కడెవరో మాట్లాడుకుంటున్నారు. వాళ్ళు చూస్తుండగా పడెయ్యలేకపోయాను'' అన్నారాయన లోపలికొస్తూ. ఈ మాటు ఆయన వెనుక కామేశ్వరరావు లేడు.

''పోనీ నాలుగడుగులు అటో ఇటో నడిచి విసిరెయ్యలేకపోయారా?'' అన్నాను.

''ఆ పనేదో నీ చేత్తోనే కానిద్దు బాబూ'' అంటూ పర్సుతీసి నాచేతికందించాడు.

ఆయన వెనుకే చెప్పులేసుకుని బయల్దేరబోయి ఎందుకో ఆగిపోయాను.

మర్నాడు ఉదయం ఇంగ్లీషు పేపరు చదువుతుంటే అకస్మాత్తుగా ఓ ఆలోచన వచ్చింది.

పర్సు దొరికిందని ఏ పేపర్లో ప్రకటన వేయించినా డబ్బు ఖర్చవుతుంది. కానీ డబ్బు తీసుకోకుండా ప్రకటనలు ఉచితంగా అచ్చువేసే కొండలరావుగారి పత్రిక ఒకటుంది. ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన వీక్లీ అది.

అంతే! కాగితం, పెన్ను తీసుకుని 'పర్సు దొరికింది' అనే శీర్షికతో ఓ ప్రకటన రాసాను. ఫలానా రంగు, పాతకాలంనాటి పర్సు, లోపల కొంచెం డబ్బుంది, ఒక తాళం చెవి, ఏవేవో వివరాలు రాసున్న ఓ చిన్న కాగితం అందులో వున్నాయి. పర్సు పోగొట్టుకున్నవారు వచ్చి వివరాలు చెప్పి తీసుకువెళ్లవచ్చు అంటూ నా అడ్రస్, ఫోన్ నెంబర్ క్రిందన రాసి ఓ కవర్లో పెట్టి వెంటనే పేపరాఫీసుకు పంపించాను.

రెండురోజుల్లో ఆ పేపర్లో ఆ ప్రకటన రానే వచ్చింది. అంతకుముందు మా ఆవిడ ఆ పేపరుకి ఓ వ్యాసం రాసి పంపితే రెండువారాలు ప్రచురించి రెమ్యూనరేషన్‌కి బదులు రెండునెలలపాటు పత్రిక ఫ్రీగా పంపుతామన్నారు. ఆఖరి కాంప్లిమెంట్ కాపీ ఇదే. సరిగ్గానే ఉపయోగించుకున్నాననిపించింది.

పేపరొచ్చిననాడు, మర్నాడూ ఎవరూరాలేదుగానీ మూడోనాడు సాయంకాలం చీకటి పడుతుండగా ఓ వ్యక్తి వచ్చాడు.

''పర్సు దొరికిందని పేపర్లో ప్రకటన వేసారు కదా. మా పర్సు పోయింది. ఆ రంగుదే. మా ఆవిడ హైదరాబాద్ వెళ్లినప్పుడు ముచ్చటపడి తెచ్చుకుంది. వారం క్రితం సరుకులు కొని ఇంటికి తెస్తుంటే మధ్యలో ఎక్కడో జారిపోయింది'' అన్నాడు.

''అది కొత్త పర్సు కాదు. అచ్చంగా లేడీ పర్సూ కాదు'' అన్నాను అతడేమంటాడోనని.

''లోపల ఎంతో డబ్బులేదులెండి. సుమారుగా నాలుగొందలుంటుంది. తాళం చెవి కూడా మా కర్ర బీరువాకి వేసిన నవతాళ్‌ది. అవికాక డిపార్టుమెంటు స్టోరువారిచ్చిన చీటీలో, మరోటో అందులో ఉండి వుండొచ్చు'' అన్నాడతను నా మాటను వినిపించుకోకుండానే.

''ఆ పర్సు మీది కాదులెండి. డబ్బూ సరిపోలేదు, తాళం చెవి, చీటీ వివరాలు కూడా మీరు చెప్పినవి కావు'' అన్నాను.

''పోనీ చూపించండి'' అన్నాడాయన.


''మీది కాదని తెల్సిపోయినప్పుడెందుకూ?'' అన్నాను.

''చూపిస్తే ఏం పోయింది? మావి కానప్పుడు తీసుకుపోతామా ఏమిటి?'' అన్నాడతను మాటల్ని పొడిగిస్తూ.

''వాదనెందుకులెండి. అది మీది కాదు వెళ్లిరండి'' అన్నాను నింపాదిగానే.

''ఏదో ఆశించే మీరా ప్రకటన వేసి ఉండాలి. లేకపోతే చూపించడానికేం?'' అంటూ ఏదో అంటూనే వెళ్లిపోయారాయన.

ఇది జరిగిన రెండురోజు



## మెదడు సంగతులు

పుట్టినప్పటి దగ్గర్నుంచీ చనిపోయే దాకా మనిషి మెదడు పెరుగుతూనే వుంటుందనుకుంటారు చాలామంది. అదే నిజమైతే ముసలైనా అన్నీ నేర్చుకోగలిగేవాళ్ళం. కాని 15 సంవత్సరాల తరువాత మెదడు పెరుగుదల ఆగిపోతుంది. అందుకే చిన్నతనంలో జ్ఞాపకశక్తి ఎక్కువగా వుంటుంది.

## కలర్ బ్లైండ్‌నెస్

కారణం తెలియకపోయినా ఆడ, మగ వ్యక్తుల్లో ఆడవాళ్ళకన్నా మగవాళ్ళలో కలర్ బ్లైండ్‌నెస్ ఎక్కువ అని శాస్త్రజ్ఞులు కనుక్కున్నారు. మగవాళ్ళలో ప్రతి రెండువందల మందిలో ఎనిమిది మందికి వర్ణ అంధత్వం వుంటే, అదే రెండు వందలమంది స్త్రీలలో ఒక్క స్త్రీకి మాత్రమే కలర్ బ్లైండ్‌నెస్‌ని గుర్తించారు.


## లాంగ్‌లివ్ హార్ట్

మనిషి హృదయాన్ని మించిన ప్రతిభావంతమైన శక్తివంతమైన పంపుసెట్‌ని మనిషి తయారు చెయ్యలేడు. అది మన శరీరంలోని ప్రతి చిన్నభాగానికి రక్తాన్ని పంపుచేస్తుంది. ఏడాదికి 15 లక్షల గేలన్ల రక్తాన్ని అది శరీరంలో నిరంతరాయంగా పంప్ చేస్తూనే వుంటుంది.

## కలల లోకం

నిద్రపోతూ కలలు కనడం సహజమే. కాని ఆ కలలు ఎంతసేపో అన్నది మనకి తెలియదు. శాస్త్రజ్ఞులు కనురెప్పల కదలికల ద్వారా యంత్ర సాయంతో ఆ విషయం కనుక్కున్నారు. మనిషి ఎనిమిది గంటల నిద్రలో ఐదు కలలు కంటాడు. అవి పది నిముషాల నిడివి నుంచి అర్ధగంటదాకా ఒక్కో కల కొనసాగుతుంది. అన్నీ రంగుల్లోనే కనిపిస్తాయి.

\- రాపేటి




లకి ఒక తెలుగు డైలీలో ఒక ప్రకటన వచ్చింది. మా కాలేజీకి సంబంధించిన ఒక నోటీసు ప్రక్కన అది బాక్సు కట్టి ప్రచురించబడి ఉండడంతో నాకళ్ళబడింది. పాతకాలంనాటి పర్సు పదిరోజులక్రితం లాసన్స్‌బే కాలనీ దరిదాపుల్లో పోయిందనీ, దొరికినవారు తెలియజేస్తే తగిన పారితోషికం ఇవ్వగలమనీ కొన్ని వివరాలు తెలుపుతూ క్రిందివారి ఫోన్ నెంబర్ ఇచ్చారు.

చాలా వివరాలు సరిపోవడంతో మర్నాడే ఆ ఫోన్ నెంబర్‌కి డయల్‌చేసి విషయం చెప్పాను. చెప్పిన అరగంటలో మా ఇంటిముందు ఓ మారుతీకారు ఆగింది. అందులోంచి ఎర్రగా పొడుగ్గా వున్న వ్యక్తి లోపలకొచ్చి తనను రవితేజగా పరిచయం చేసుకున్నాడు.

''కూర్చోండి'' అంటూ ఆయనకు కుర్చీ చూపి జగన్నాధరావుగారిని పిలుచుకు రమ్మని కబురు పంపాను.

నేను ఎదురుగా కుర్చీలో కూర్చోగానే రవితేజ చెప్పడం మొదలుపెట్టాడు.

''పాతకాలం నాటి పర్సేలెండి. మా నాన్నగారిది. ఆయన సర్వీసులో ఉండగా ఒకమారు ఆఫీసు పని మీద లండన్ వెళ్లాను. అక్కడది కొని తెచ్చారు. దాని మీద ఆర్ అనే ఇంగ్లీషు అక్షరం మెటల్‌ది ఉంటుంది. మా నాన్నగారి పేరు రాజారావు. మా అమ్మ పేరు రాజ్యలక్ష్మి. అలా ఇద్దరి పేర్లకీ ఆ అక్షరం సరిపోయాయి. మా అమ్మ దానిని ఇష్టపడిందని ఆమెకు ప్రజెంట్ చేసారాయన.

ఎన్నో సంవత్సరాలు ఆ పర్సు మా అమ్మ దగ్గరే వుంది. ఆవిడ అందులో ఆయన ఇచ్చే జీతం దాచి ఖర్చు పెట్టేది. ఆమె పోయి ఆర్నెల్లయింది. అప్పట్నుంచీ మా నాన్నగారు దాన్ని ప్రాణంకన్నా మిన్నగా చూసుకుంటూ అందులో మా అమ్మని చూసుకునేవారు. తనకొచ్చే పెన్షన్‌లోని కొన్ని కొత్తనోట్లను అందులో దాచుకుంటూ మనవడికి చూపిస్తుండేవారు. మీకు దొరికిన పర్సు అదే అయితే అందులోని తాళం గాడ్రెజ్ కంపెనీ మొదట్లో తయారుచేసి మార్కెట్‌లోకి విడుదల చేసిన నాలుగడుగుల బీరువాది. అందులోనే మా నాన్నగారు ఆయన బట్టలు, పుస్తకాలూ, స్నేహితులు రాసిన ఉత్తరాలూ పెట్టుకునేవారు. ఇక అందులోని కాగితమంటారా దాని సంగతి చూస్తేనేగానీ చెప్పలేను.

పదిరోజుల క్రితం కార్లో బీచికి వస్తూ చిన్న మనవడు మారం చేస్తుంటే వాడి చేతికిచ్చారుట. వాడెక్కడ పారేసాడో... ఇంటికొచ్చి చూస్తేలేదు. తర్వాత ఆ దారంతా వెదికినా ప్రయోజనం కనిపించలేదు. మీకభ్యంతరం లేకపోతే ఆ పర్సు చూపితే అది మాదో కాదో చెప్పగలను'' అన్నాడాయన.

''సందేహంలేదు. అది మీదే అయి తీరుతుంది'' అన్నాన్నేను.

జగన్నాధంగారు ఎప్పుడొచ్చి కూర్చున్నారోగానీ నావైపు ఆశ్చర్యంగా చూస్తున్నారు.

''మీ నాన్నగారిప్పుడు...'' అంటూ ఆగాను. ఆ ప్రశ్న ఎందుకేసానో నాకే తెలీదు. సంబంధంలేని ప్రశ్న.

''నాన్నగారుపోయి ఈవాల్టికి నాలుగోరోజు'' అన్నాడాయన.

గతుక్కుమన్నాను నేను.

''ఆ పర్సు పోయిన దగ్గరనుంచి ఆయన తన సర్వస్వాన్ని పోగొట్టుకున్నట్టే అయిపోయారు. నిజానికి ఆ పర్సుకీ అందులోని వాటికీ ఇప్పుడు ఖరీదు కడితే ఏం ఉండదు. కానీ దానికో ప్రత్యేకమైన విలువ వుంది. దాన్ని మా అమ్మ ఎంతో ఇష్టంగా చూసుకునేది. ఆమె పోయాక ఆమె జ్ఞాపకంగా నాన్నగారు దాన్ని ప్రాణసమానంగా చూసుకునేవారు. ఇప్పుడు వాళ్లిద్దరూ లేరు. కనీసం వారి జ్ఞాపకంగానైనా అది మిగలాలనే ఈ ప్రకటన వేసాను'' ఆయన గొంతులో జీర కన్పించింది.

లోపల్నుంచి పర్సు తెచ్చి ఆయనకు అందించాను. దాన్ని చూడ్డంతోనే రవితేజ కళ్ళు ఆనందంతో మెరిసాయి.

''ఇదే'' అన్నారాయన నావంక కృతజ్ఞతాపూర్వకంగా చూస్తూ.

నేను మాట్లాడకుండా జగన్నాధరావుగారివంక చూసాను.

''పర్సు పోయిందంటే మారుతాళం చెవితో బీరువా తెరిపించానుగానీ పర్సు వెదికించే మరో ప్రయత్నం చేయలేకపోయాను'' అన్నాడు రవితేజ.

జగన్నాధరావుగారు విషయం అర్ధంకాక నావంక, ఆయనవంక చూసారు.

''నేను ప్రకటించింది అతి చిన్న బహుమతే అయినా దాన్ని మీ మంచితనానికీ, నిజాయితీకి నేనందిస్తున్న అభినందనగానే తీసుకోండి'' అంటూ జేబులోంచి ఐదువందల రూపాయల నోట్లు తీసి అందించబోయారు.

''మీ అభినందనైనా, బహుమతైనా అది నాక్కాదు. అదిగో వారికందాలి. వారికే మీరివ్వాలి'' అంటూ జగన్నాధరావుగార్ని చూపించాను.

ఈమారు ఆశ్చర్యపోవడం రవితేజ వంతైంది.

''నిజమే. మీ పర్సు దొరికింది వారికే. అది స్వంతదారుడికి అందజేయడమెలా అని తల్లడిల్లిందీ వారే. నేను నిమిత్తమాత్రుడిని'' అన్నాను.

''పర్సులకేగానీ మనసులకు విలువల్లేని ఈ రోజుల్లో ఆ పర్సు చుట్టూ ఇన్ని ఆప్యాయతలు, ప్రేమాభిమానాలు, జ్ఞాపకాలు అల్లుకుని వుంటే అది మీ దగ్గరకు రాకుండా ఎలా వుంటుంది చెప్పండి. నేనూ నిమిత్తమాత్రుడినే. నాకు ఆ తృప్తే ఉండనివ్వండి' అంటూ రెండు చేతులతోనూ ఆయనకు నమస్కరించి ''థాంక్స్ మాస్టారూ. వస్తాను'' అంటూ నాతో చెప్పి మరో మాటకు ఆస్కారమివ్వకుండా మెట్లు దిగి వెళ్లిపోయారు జగన్నాధరావుగారు.

★